క్లుప్తంగా

నేర్చుకున్న విజ్ఞానంతో కెరీర్‌లో ఎదగాలి

ఒంగోలు టౌన్: కళాశాలలో నేర్చుకున్న విజ్ఞానాన్ని కెరీర్‌లో ఎదగడానికి ఉపయోగించుకోవాలని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి సూచించారు. స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాలలో రెండురోజుల నుంచి జరుగుతున్న జంతుశాస్త్ర నమూనాల తయారీ కార్యశాల శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా హోల్డ్ స్కోప్‌ను ఉపయోగించి సూక్ష్మాతి సూక్ష్మజీవుల పరిశీలన, వాటి కదలికల చిత్రీకరణ విధానం గురించి చీరాల వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ రిసోర్స్‌పర్సన్ ఈ రామరాజు వివరించారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ పి.కుసుమకుమారి, జంతుశాస్త్ర అధ్యాపకులు వి.శ్రీలక్ష్మి, వీఎస్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి సేవలు అభినందనీయం

చీమకుర్తి: మండలంలోని తొర్రగుడిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న టీచర్ కే విజయలక్ష్మి అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు కొనియాడారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తొర్రగుడిపాడు పాఠశాల నుంచి విజయలక్ష్మి బదిలీ కావడంతో ఎంపీపీ ఆధ్వర్యంలో శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి విద్యార్థులకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓలు వెంకటేశ్వర్లు, శివాజీ, కాంప్లెక్స్ చైర్మన్ కాంతారావు, స్థానిక పాఠశాల హెచ్‌ఎం వై.రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వెంటనే పొజిషన్ ఐడీలు కేటాయించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా విద్యాశాఖ అధికారుల కార్యాలయంలో అధికారులకు ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రాన్ని అందించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారుల ద్వారా ఉపాధ్యాయుల ఐడీలను తెప్పించుకుని సీఎఫ్‌ఎంఎస్ ఆఫీసుకు వెంటనే పంపి ఉపాధ్యాయులకు జీతాలు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంసీఏ అధ్యక్షునిగా నాగేశ్వరరావు



ఒంగోలు: మీడియా కెమేరా మెన్స్ అసోసియేషన్ (ఎంసీఏ) నూతన అధ్యక్షునిగా వార్త సీనియర్ ఫొటోగ్రాఫర్ వేల్పూరి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎంసీఏ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎంసీఏ సమావేశానికి ప్రస్తుత అధ్యక్షుడు ఇఫ్తికర్ బాషా అధ్యక్షత వహించారు. నూతన అధ్యక్షునిగా నాగేశ్వరరావు పేరును అచ్చుకాల రాజశేఖర్ ప్రతిపాదించగా మిగిలిన సభ్యులంతా ఆమోదించారు.

మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఎమ్మెల్యే టీజేఆర్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల నూతన కన్వీనర్లు

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దామని స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నూతనంగా నియమించబడిన ఆ పార్టీ మండలాల కన్వీనర్లకు పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయం సంతనూతలపాడు నియోజకవర్గంలో నూతనంగా నియమించిన కన్వీనర్లు శనివారం ఒంగోలులోని ఎమ్మెల్యే కార్యాలయంలో సుధాకర్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. చీమకుర్తి మండల కన్వీనర్‌గా పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి పట్టణ కన్వీనర్‌గా క్రిష్టిపాటి శేఖరరెడ్డి, సంతనూతపాడు మండల కన్వీనర్‌గా దుంపా చెంచిరెడ్డి, మద్దిపాడు మండల కన్వీనర్‌గా మండవ అప్పారావు, నాగులుప్పలపాడు మండల కన్వీనర్‌గా పోలవరపు శ్రీమన్నారాయణ, సంతనూతలపాడు మండల పరిధిలోని ఒంగోలు క్లస్టర్-4 కన్వీనర్‌గా గోలి కోటేశ్వరమ్మను వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే టీజేఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మండవ అప్పారావుకు పలువురి అభినందనలు



మండవ అప్పారావును సన్మానించి కేక్ తినిపిస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల కన్వీనర్‌గా మరోసారి నియమితులైన మండవ అప్పారావును శనివారం పలువురు అభినందించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి మండల అధ్యక్షుని బాధ్యతలను అప్పారావు నిర్వర్తించారని, 12 సార్లు మండల అధ్యక్షునిగా పనిచేసిన ఆయనపై పార్టీ అధిష్టానం పూర్తి నమ్మకం కలిగి ఉందనడానికి మరోమారు ఆయనకు పార్టీ మండల అధ్యక్ష పదవి దక్కడమే నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా అప్పారావుకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి తినిపించి పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, పార్టీ సీనియర్ నాయకులు మోరబోయిన సంజీవరావు, గుడ్లపాతల రవి, మజీద్ మాస్టర్, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు బెజవాడ రాము, మండల అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, బొమ్మల రామాంజనేయులు, రావూరి ప్రసన్నాంజనేయరెడ్డి, అశోక్, సుబ్బారావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ రక్షణ



మేయర్ గంగాడ సుజాతకు బీపీ చూస్తున్న ఏఎన్‌ఎం

ఒంగోలు సబర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అందరికీ రక్షణ వంటిదని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. శనివారం మేయర్ సొంత డివిజన్ అయిన 18వ డివిజన్‌లోని చెరువు కొమ్ముపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టారు. తొలుత వైద్య సిబ్బంది మేయర్ గంగాడ సుజాతకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నాయుడుపాలెం హైస్కూల్లో గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయంలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ బీ జవహర్, బదరీనారాయణ

చీమకుర్తి: దాతల సహకారంతో మండలంలోని పీ నాయుడుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ జవహర్, గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ చేతుల మీదుగా శనివారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. నాయుడుపాలెం పాఠశాల పూర్వ విద్యార్థి కూరాకుల సిద్దారెడ్డి ఆర్థిక సహకారంతో గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలు అందించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు వారి విద్యాప్రమాణాలను మెరుగుపరచుకోవాలని డాక్టర్ జవహర్, బదరీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా కరుణప్రియ, మంచికంటి వెంకటేశ్వరరెడ్డి, బొంతా ఏసుదాస్, చలువాది రమేష్, దరిమడుగు నాగరాజు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు టౌన్: నగరంలోని డీ 3 సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ గాయం వినయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక లంబాడిడొంక, సుందయ్య భవన్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, సత్యనారాయణపురం, దిబ్బలరోడ్డు, కర్నూలు రోడ్డు, నాగేంద్రనగర్, బృందావన్‌నగర్, నిర్మల్‌నగర్, ఉడ్ కాంప్లెక్స్ పరిసరాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రైవేటు పాఠశాలలు 30లోగా కాంట్రిబ్యూషన్ చెల్లించాలి

ఒంగోలు: జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డుకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చెల్లించాల్సిన కాంట్రిబ్యూషన్‌ను ఈ నెలాఖరులోగా చెల్లించాలని డీఈవో వీఎస్ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2023-24 బ్యాచ్‌కు ప్రశ్నపత్రాల చెల్లింపునకు సంబంధించిన మొత్తాన్ని ఇండియన్ బ్యాంక్ అకౌంట్‌కు చెల్లించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సంబంధించిన ఫారం, బ్యాంకు కౌంటర్ ఫైల్, పాఠశాల రికగ్నైజేషన్ కాపీ జతచేసి జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యాలయం, ఒంగోలుకు పోస్టు ద్వారా లేదా స్వయంగా గాని అందజేయాలన్నారు. ఈ నెల 30వ తేదీలోగా చెల్లించని పక్షంలో అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. కరస్పాండెంట్లు ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం



మోడల్ ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న రాధా శింగమనేని

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమని, ఆదాయం పొందదగినదని నేచురల్ ఫార్మింగ్ యూనిట్ ఇన్‌చార్జ్ రాధా శింగమనేని అన్నారు. మండలంలోని బొద్దులూరివారిపాలెం గ్రామంలో రైతు సాధికారిక సంస్థ ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో శనివారం ఏటీఎం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళా రైతులు మరియమ్మచే ఏడాది పొడవునా ఆదాయం పొందేలా 30 రకాల ఆకుకూరలు, కూరగాయల సాగు మొదలుపెట్టారు. అనంతపురం నుంచి వచ్చిన ప్రసాద్ మాట్లాడుతూ సన్నకారు రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి ఆర్థికంగా, ఆరోగ్యకరంగా ఆలోచించి పంటలు పండించవచ్చన్నారు. రాధా శింగమనేని మాట్లాడుతూ జీవామృతం తయారు చేసే విధానం, ఉపయోగించే విధానం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ కె.పద్మావతి, ఝాన్సీలక్ష్మి, చిరంజీవి, మరియమ్మ, కృష్ణవేణి, నాని, శ్రీనివాసరావు, నాంచార్లురెడ్డి పాల్గొన్నారు.

ఓజోన్ పొర సంరక్షణలో భాగస్వాములు కావాలి



చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో ఓజోన్ ఆకారంలో విద్యార్థులు



గొడుగులు, క్యాప్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చీమకుర్తి: ప్రపంచ మానవాళి, సమస్త జీవరాసులకు రక్షణ కల్పిస్తున్న ఓజోన్ పొరను కాపాడుకోవడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, సంతనూతలపాడు మండలం మంగమూరు జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్‌ఎం బీ సుధాకర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఓజోన్ పొర సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశ్రమల నుంచి వెలువడే కార్బన్‌లు, ఇతర ప్రమాదకరమైన పదార్థాల కారణంగా ఓజోన్ పొర దెబ్బతినడం వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఓజోన్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు డ్రాయింగ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. చీమకుర్తిలో గొడుగులు, క్యాప్‌లు ధరించి మెయిన్‌రోడ్డుపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓజోన్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలు నుంచి ఏపీఎన్‌జీసీ కో ఆర్డినేటర్ నూకతోటి సుబ్బారావు, మంగమూరు హైస్కూలు నుంచి జిల్లా అప్‌కాస్ట్ కో ఆర్డినేటర్ టీ రమేష్, స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈదుమూడి జెడ్పీ హైస్కూల్లో...

నాగులుప్పలపాడు: అధిక సూర్యరశ్మి నుంచి సమస్త జీవులను కాపాడే ఓజోన్ పొర సంరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతని ఏపీఎన్‌జీసీ జిల్లా క్లస్టర్ కో ఆర్డినేటర్ స్వర్ణలత అన్నారు. ప్రపంచ ఓజోన్ పొర దినోత్సవం సందర్భంగా ఈదుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పొర ఉపయోగాలు, జీవరాశి సంరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఓ3 ఆకారంలో వలయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకరరావు, సాంబశివరావు, వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.



ఈదుమూడి పాఠశాలలో ఓ3 ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

హాకీ, రెజ్లింగ్‌లో క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిలు

చీమకుర్తి: హాకీ, రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు జిల్లా తరఫున క్రీడాకారులను ఎంపిక చేశారు. శనివారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్లో ఈ పోటీలు నిర్వహించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని పలు హైస్కూళ్ల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో క్రీడానైపుణ్యాలు ప్రదర్శించిన వారిని జిల్లా జట్లుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రెజ్లింగ్ విభాగంలో అండర్ 14, 17 కేటగిరీలలో జిల్లా స్థాయిలో ఎంపికలు మైనంపాడు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో జరిగాయి. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్థానికులు అభినందించారు. ఆయా కార్యక్రమాలలో హెచ్‌ఎం పీ శ్రీనివాసరావు, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

మట్టి గణపయ్యలతో పర్యావరణానికి మేలు

- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో మట్టి గణపయ్య విగ్రహాల పంపిణీ
- ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేసిన మేయర్ గంగాడ సుజాత



మట్టి గణపయ్య విగ్రహాలను పంపిణీ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి గణపయ్య విగ్రహాలను వినియోగించాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత కోరారు. స్థానిక ముంగమూరు రోడ్డులోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు మట్టి బొజ్జ గణపయ్య విగ్రహాలను పంచిపెట్టారు. వినాయకచవితిని పురస్కరించుకుని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు దాదాపు 2000కుపైగా విగ్రహాలను ప్రజలకు అందజేశారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మేయర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను వినాయక విగ్రహాలలో వాడకూడదన్నారు. నీటిలో సులభంగా కరిగిపోయే మట్టి విగ్రహాలను వాడితే పర్యావరణాన్ని కాపాడినవారమవుతామన్నారు.

తీర ప్రాంత పరిశుభ్రతపై అవగాహన



కొత్తపట్నం బీచ్‌ను శుభ్రం చేస్తున్న ఇంకాయిస్ సభ్యులు, అధికారులు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): తీర ప్రాంతంలో నివస్తున్న ప్రజలు పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖరరెడ్డి అన్నారు. అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఐఎన్‌సీఓఐఎస్), మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ (ఎంఓఈఎస్), భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో తీర ప్రాంత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ శనివారం కొత్తపట్నం బీచ్ ప్రాంతంలో కార్యక్రమం ప్రారంభించామని చెప్పారు. ఇంకాయిస్ సైంటిస్ట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సంభావ్య ఫిషింగ్ జోన్ సలహాలు, సముద్ర సమాచార సేవలను ఇంకాయిస్ అందిస్తోందన్నారు. బీచ్ అంతా పరిశుభ్రం చేశారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ, మెరైన్ సీఐ శ్రీనివాసరావు, ఎంపీడీవో పి.సుజాత, మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్, ఎంఎస్ఎస్ రాష్ట్ర సెక్రటరీ సున్నపు తిరుపతిరావు, వాయల విజయరత్నం, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, గ్రామస్తుల పాల్గొన్నారు. సముద్రం నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, ప్లాస్టిక్ సంచులను తొలగించారు. హెచ్‌సీఎల్ ఫౌండేషన్ వారు 10 డస్ట్‌బిన్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ వి.ఆనంద్‌రావు, ఎంపీడీవో పి.సుజాత, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సిబ్బంది బాలాజీ రామన్, నంద కిషోర్, ప్రదీప్ నాయర్, సుధీర్ వర్మ, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాలు

- వేడుకలకు హాజరైన ఆర్‌జేడీ సుబ్బారావు



ఉపాధ్యాయులకు పురస్కారాలు అందిస్తున్న ఆర్‌జేడీ సుబ్బారావు, డాక్టర్ వంశీకృష్ణ

కొత్తపట్నం: గ్రామంలో విద్యార్థులకు విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించి వారి సేవలకు గుర్తుగా వారిని అభినందిస్తూ వారి సేవలు స్మరించుకుంటూ వారిని సన్మానించుకోవడం, సత్కరించుకోవడానికి బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికయింది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాల మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్‌జేడీ వి.సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ చాపల వంశీకృష్ణ, శాంతకుమారి విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలును కొనియాడారు. ఇటువంటి సేవలు అందరికీ ఉండవని పేద కుటుంబంలో పుట్టి పెరిగి మంచి సేవలు అందించడం అభినందించారు. డిప్యూటీ ఈవో రోజారాణి, ఎంఈవో పద్మావతి, తులసీ కుమారి, హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు, శ్రీవాణి విద్యానికేతన్ కరెస్పాండెంట్ చాపల కోటేశ్వరావు, పిన్ని బంగారయ్య, పిన్ని వెంకటేశ్వర్లు, చాపల చిరంజీవి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

126 మంది ఉపాధ్యాయులకు..

డాక్టర్ చాపల వంశీకృష్ణ సహకారంతో శ్రీరాం మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీవాణి విద్యానికేతన్ హైస్కూల్ ఆధ్వర్యంలో పలువురికి సత్కారాలు చేశారు. కె.పల్లెపాలెంలో ఉన్న మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, శ్రీవాణి విద్యానికేతన్, శ్రీరామ్ బాలసంస్కార కేంద్రాల నుంచి 126 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి మధుసూదన్‌రావు, పల్లెపాలెం పాఠశాల నుంచి షీలా మాధురి, శ్రీవాణి విద్యానికేతన్ నుంచి బేతాళ వెంకట్రావుకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ఇచ్చారు. వంశీకృష్ణ చిన్ననాటి గురువు లెక్కలు మాస్టర్ చిట్టాబత్తిన కల్లయ్య, బోటనీ లెక్చరర్ కె.రాజగోపాల్ సన్మానించారు.

పేస్‌లో చంద్రయాన్-3పై సైన్స్ ఎక్స్‌పో

ఒంగోలు టౌన్: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం చంద్రయాన్-3పై సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. చంద్రయాన్-3 ప్రయోగంలో ఇస్రో శాస్త్రవేత్తలు ఉపయోగించిన టెక్నాలజీ, దాని పనితీరు గురించి వివిధ రకాల పోస్టర్లు, ఫొటోలు, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ల ద్వారా విద్యార్థులకు వివరించారు. అంతరిక్ష పరిశోధనలో అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి భారతీయ శాస్త్రవేత్తలు పడిన బాధలు, కసిగా చేసిన కృషి గురించి వక్తలు ప్రసంగించారు. ఇస్రో శాస్త్రవేత్తల జీవిత విశేషాలను తెలియజేశారు. ఇందులో 50కిపైగా ఫొటోలను ప్రదర్శించారు. 30కిపైగా పార్టిసిపేషన్ సర్టిఫికేషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ ఆర్.వీరాంజనేయులు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.కొండయ్య, డీన్ ఆఫ్ ఐఐసీ డాక్టర్ మల్లికార్జునచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యావేత్త సుచరిత సేవలు కొనసాగిస్తాం

ఒంగోలు టౌన్: ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన మాంటిస్సోరి హైస్కూల్ పూర్వ ప్రిన్సిపాల్ వంతం సుచరిత సేవలను కొనసాగిస్తామని మాంటిస్సోరి చైర్మన్ ప్రకాష్‌బాబు తెలిపారు. శనివారం మాంటిస్సోరి హైస్కూల్లో జానుడి ఆధ్వర్యంలో మొదటి మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఫాతిమా -దేశంలో మహిళా హక్కులు అనే అంశం మీద స్మారక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ప్రతిఏటా విద్యావేత్త సుచరిత స్మారక ఉపన్యాసాన్ని నిర్వహించి విద్యారంగాభివృద్ధికి కృషిచేసిన వారికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతిఒక్కరికీ సమాన హక్కులు కల్పించిందని, ఈ చట్టాల గురించి విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జస్టిస్ ఫాతిమా సాధించిన విజయాలను వివరించారు. అనంతరం ఫాతిమా జీవిత విశేషాలపై క్విజ్ పోటీ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైస్కూలు ప్రిన్సిపాల్ నరేష్‌బాబు, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ చాలా గొప్పది



మద్దిరాలపాడులో వైద్య సేవలను పరిశీలిస్తున్న డాక్టర్ యాదాల అశోక్‌బాబు

నాగులుప్పలపాడు: అందరికీ అవసరమైన వైద్యాన్ని గ్రామాల్లో అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఆరోగ్యశ్రీ స్టేట్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించే క్రమంలో శనివారం మద్దిరాలపాడు సబ్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు అందుతున్న వైద్యాన్ని స్వయంగా పరిశీలించారు. అందిస్తున్న మందుల గురించి రోగులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి పేదల కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో చేస్తున్న 14 రకాల టెస్టులు, అందిస్తున్న 125 రకాల మందుల గురించి రోగులకు వివరించారు.